# లివ్ అండ్ లెట్ లివ్

విశాఖపట్నం యింకా ఇరవై మైళ్ళ దూరంలో ఉంది. ఏదో చిన్న స్టేషన్‌లో పాసింజరు ఆగింది. అప్పటికే ఆ కంపార్ట్‌మెంటు చాల రద్దీగా ఉంది. మరి కొంత మంది ఎక్కారు. రెండు నిమిషాలాగి బయలుదేరింది పాసింజరు.

ఒక విద్యార్థి చేతిలో పుస్తకాలతో కూర్చోడానికి జాగా కోసం కంపార్టుమెంటంతా తిరిగి చివరికి మూర్తికి ఎదురుగా నిలబడ్డాడు. అతణ్ణి పరీక్షగా చూశాడు మూర్తి. చురుకైన కళ్ళు! అందర్నీ ఇట్టే ఆకర్షించే రూపం! బక్కపల్చగా నాజూగ్గా ఉన్నాడు. తెలివైన వాడిలా కన్పించాడు మూర్తికి. కొంచెం ప్రక్కకు జరిగి చోటిచ్చాడు. కళ్ళతోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ అతని ప్రక్కనే కూర్చున్నాడా విద్యార్థి.

"ఏం చదువుతున్నావ్?" మాటల్లోకి దింపాడు మూర్తి.

"ఇంటర్ సెకండ్ ఇయర్ సార్!" వినయంగా చెప్పాడు.

"ఏ గ్రూప్?"

"ఎమ్. పి. సి!"

"బాగా చదువుతున్నావా? పరిక్షలెప్పుడు? ఈ రోజు కాలేజికి శలవు కదా!"

"ఎగ్జామ్స్‌కి ఇంకా పదిహేను రోజులే టైముంది సార్! ట్యూషన్‌కి వెళ్తున్నా! బాగానే చదువుతున్నా! క్లాస్ వస్తుందనే ఆశతో ఉన్నా సార్!" అతని మాటల్లో విధేయత ఉట్టిపడింది.

"ఇంటర్ అయ్యాక ఏం చదువుదామనుకొంటున్నావ్?"

"ఇంజనీర్ చదవాలనుకొంటున్నాను సార్!"

అతని వినయవిధేయతలకు ముగ్ధుడైన మూర్తి అతని వైపే చూస్తూ ఉండిపోయాడు.

"ఇంజనీర్ చదవడానికి సీటు దొరుకుతుందా సార్?" అతని మొహంలో ఆందోళన కన్పించింది. అతని ప్రశ్నకి జవాబు చెప్పలేదు మూర్తి. "నీ పేరు?" అడిగాడు.

"సోమయాజుల కృష్ణశాస్త్రి సార్!" చెప్పాడు నమ్రతగా.

అతని జాతి, కులమూ అడిగి తెల్సుకోవాలనుకొన్న మూర్తికి ఆ అవసరం లేకపోయింది.

"సీటు దొరుకుతుందంటారా సార్?" మళ్ళీ అడిగాడు శాస్త్రి.

"దొరకదని ఎందుకు అనుకొంటున్నావ్?" డొంక తిరుగుడుగా తిరిగి ప్రశ్నించాడు మూర్తి.

"మూడేళ్ళక్రితం మా ఊరి ప్రెశిడెంట్‌గారబ్బాయి ఇంటర్‌లో ఎనభైశాతం మార్కులు సంపాదించాడు. అయినా ఇంజనీరింగ్‌లో సీటు రాలేదు. బి.యస్సీలో జాయిన్ అయ్యాడు. మామూలుగా పాసైన మా గురవయ్య మాష్టారుగారబ్బాయికి సీటు దొరికింది." అన్నాడు. శాస్త్రిలో ఆవేదనా, ఆందోళనా ముసురుకొన్నాయ్.

"అతను వెనుకబడిన జాతికో, వర్గానికో చెందినవాడై ఉంటాడు!" అన్నాడు మూర్తి.

ఆ పసి హృదయంనుంచి నిరాశ పెల్లుబికింది. అసూయ బుసకొట్టింది.

"అవునండీ! వాళ్ళకన్నీ రిజర్వేషన్లే! మాలాంటి వాళ్ళం చదువుకొంటామంటే కాలేజిలో సీటు దొరకదు. ఇక ఉద్యోగాల సంగతి వేరే చెప్పనక్కరలేదు!"

మూర్తి మాట్లాడలేదు. తన గతం అతని కళ్ళముందు సినిమా రీలులా తిరిగింది.

మూర్తి తండ్రి రామశర్మ ఒక రాష్ట్రప్రభుత్వం ఆఫీసులో పని చేసేవాడు. నలభై సంవత్సరాల సర్వీసు పూర్తిచేశాడు. పెద్దకాలం సేవ చేసినందుకు ప్రతిఫలంగా మరో అర్నెల్లలో పూర్తి విశ్రాంతి ప్రసాదించబోతోంది ప్రభుత్వం. ఇద్దరాడపిల్లలకి పెళ్ళిళ్లు చేశారు. మూడు, నాలుగు సంతానం మగ పిల్లలు. పెద్దబ్బాయి మూర్తి.

బియ్యే ప్యాసయి అయిదు సంవత్సరాలవుతున్నా ఉద్యోగం దొరకలేదు. చాల కాంపిటీషన్ పరిక్షలు వ్రాశాడు. ఇంటర్వ్యూలు చూశాడు.

ఆడపిల్లల పెళ్ళిళ్ళకి చేసిన అప్పులభారం ఒకవైపూ,తనయునికి ఉద్యోగం లభించలేదన్న విచారమూ. త్వరలో రిటైర్ కాబోతున్నందుకు ఆందోళన మరోవైపూ రామశర్మగారిని కృంగదీస్తున్నాయ్. ఉద్యోగం కోసం తిరిగి తిరిగి విసిగి వేసారిన మూర్తి పోకడలూ, మాటలూ చాల విపరీతంగానూ, ఆందోళనకరంగానూ మారాయ్. విప్లవ భావాలు పొడచూపాయ్. తనయునిలో కన్పిస్తున్న మార్పులు రామశర్మగారిని ఆందోళన పర్చసాగాయ్.

ఈ రిజర్వేషన్లవల్ల ప్రతిభగల అభ్యర్ధికి తీరని అన్యాయం కలుగుతోంది నాన్నగారూ! నేనంత బాగా రాశానా! సెలక్టు కాలేదు. ఇంటర్ మామూలు క్లాసులో పాసైన ఆ పోలయ్య కొడుకుని సెలక్టు చేశారు. ఇది చాల అన్యాయం!"

ఆ రోజు సాయింత్రం ఇంట్లో అడుగుపెడుతూ విరుచుకు పడ్డాడు మూర్తి.

"అవును బాబూ! అతడు వెనుకబడిన వర్గానికి చెందిన వాడు!" శాంతంగా అన్నారు రామశర్మ.

తండ్రి మాటలు మూర్తికి చిర్రెత్తించాయ్! ఆవేశం పెల్లుబికింది. తానేం మాట్లాడుతున్నాడో తెలియని స్థితికి చేరుకొన్నాడు.

"ఏమీః చేతగాని వాళ్ళను అందలం ఎక్కిస్తోంది ప్రభుత్వం! ఆఫీసులలో ఎఫిసియెన్సీ తగ్గిపోతోందని ఒక ప్రక్క ఆరోపిస్తూ విచారాన్ని వ్యక్తంచేస్తూ ఏమీః రానివాళ్లకు మరోప్రక్క ప్రవేశం కల్పిస్తున్నారు! ఎలిమెంటరీ స్కూలునుండి యూనివర్శిటీ వరకూ, ఉద్యోగావకాశాలు నుంచి ప్రమోషన్ల వరకూ వాళ్ళకి ప్రత్యేక రాయితీలు, సడలింపులూ, సదుపాయాలూ. ఇది చాల అన్యాయం! ఈ పద్ధతి మారాలి! మారకపోతే ప్రతిఘటన తప్పదు!" ఉద్రేకపడ్డాడు మూర్తి.

తనయుని ధోరణికి తల్లడిల్లారు శర్మగారు. భయపడ్డారు. ఆందోళన చెందారు. నెమ్మదిగా నచ్చచెప్పాలనుకొన్నారు.

"ఆవేశపడ్డం, అనాలోచితంగా ఒకరిని నిందించడం ద్వేషించడం అవివేకుల లక్షణం! సంస్కారహీనుల స్వభావం! ఒక తండ్రికి నలుగురు కొడుకులుంటారు! తమ పిల్లలందరూ ప్రయోజకులు కావాలని కాంక్షిస్తారు తల్లిదండ్రులు. పిల్లలంతా ఒక్కలా ఉండరు కదా! వారిలో ఒకడు అవిటి వాడయ్యాడనుకో! అప్రయోజకుడనీ ఎందుకూ పనికిరాడనీ ఆ తల్లిదండ్రులు అతని కర్మానికి అతడిని వదిలేయరుకదా! తక్కిన పిల్లలతో వాణ్ణికూడా ప్రయోజకుడ్ని చేయాలనీ, వృద్ధిలోకి తేవాలనీ ఆ అర్భకుని భవిష్యత్తును కూడా మెరుగు పరచాలని తాపత్రయపడతారు. ప్రత్యేక శ్రద్ధతో- అవసరమయితే అధిక వ్యయానికైనా వెనుదీయక వాని బాగుకై శ్రమిస్తారు. తన కాళ్ళపై నిలబడే శక్తి వచ్చేలా చూడాలనుకొంటారు. అలాంటి పరిస్థితిలో ఆ అభాగ్యుని బాగుకై అధిక ధనాన్ని, కాలాన్నీ వెచ్చించాల్సివస్తుంది. "ఆ అవిటి వాని కోసం ఎందుకంత డబ్బు వృథా చేస్తారు?" అని తక్కిన పిల్లలు నిలదీసి తండ్రిని ప్రశ్నిస్తే ఆ తండ్రి ఏమని సమాధానం చెబుతాడు బాబూ!....."

అని ఆగి ప్రశాంతంగా తనయుని కళ్ళలోకి చూశారు శర్మగారు. తనయునిలో పెచ్చురిల్లిన బాధ తొలగలేదని గ్రహించి కలవరపడ్డారు. ఇంకా చెప్పడం మొదలు పెట్టారు.

"ఒక డిపార్టుమెంట్‌లో ఇరవై ఖాళీలున్నాయ్ అనుకొందాం! ఎక్కువ స్థానాలు అంటే పధ్నాలుగు స్థానాలు ఇతర కులాల వారికీ, మిగిలిన అతి తక్కువ స్థానాలు అంటే ఆరు మాత్రమే వెనుకబడిన వర్గాలకీ, కులాలకీ కేటాయిస్తారు. గట్టిగా కృషిచేసి శ్రమించి మీ వర్గానికి కేటాయించిన పధ్నాలుగు స్థానాలలోనూ ఒకటి సంపాదించుకోవాలి! అంతేకాని అర్భకులకీ వెనుకబడిన వర్గాలకీ, కులాలకీ కేటాయించిన సీట్లపై దండయాత్ర చేయడం పరధనం కోసం ప్రాకులాడ్డమే అవుతుంది. పశుపక్ష్యాదులు, జలచరాలు ఏం చేస్తాయ్? బలం ఉన్నవి బలహీన ప్రాణుల్ని హింసించి భక్షిస్తాయ్. పరమోత్కృష్టమైన మానవజన్మ ఎత్తిన మనం ఆ పశుపక్ష్యాదుల్లా ప్రవర్తించగూడదు బాబూ! నీవు జీవించు! ఇతరులను జీవింపనీయ్! లివ్ అండ్ లెట్ లివ్!

ఇక ఎఫిషియెన్సీ అంటావా! రాయగా రాయగా కరణం పారగా పారగా

మరణం అంటారు. పుట్టుకతోనే ఎవరికీ తెలివితేటలబ్బవోయ్! తాను పెరిగిన వాతావరణాన్ని బట్టే ఉంటాయ్! మంచి శిక్షణా గైడెన్సు ఉంటే తప్పకుండా ప్రతిభావంతులవుతారు! బాగా చదువు! మంచి రేంక్ సంపాదించుకో! అప్పుడు మీకు కేటాయించిన స్థానాలలోనే ఒక సీటు లభించి తీరుతుంది! నీకు సెలక్షన్ రాలేదని యితర కులాలవార్ని ద్వేషించడం ప్రభుత్వాన్ని నిందించడమూ అవివేకం బాబూ!"

కుమారుని శాంతింపచేయడానికి తాపత్రయపడ్డాడు తండ్రి.

తండ్రి మాటలు గారడీవాని మంత్రంలా మభ్యపెడుతున్నట్టుగా తోచాయ్ మూర్తికి. మౌనం వహించాడు.

మర్నాడు ఉదయం భర్త ఆఫీసుకెళుతుంటే అంది శర్మగారి అర్థాంగి శకుంతల.

"బేంక్ ఉద్యోగానికి అప్లికేషన్ పెడ్తానంటున్నాడు మూర్తి."

భర్త ఏమీ సమాధానం చెప్పకపోవడంతో మళ్ళీ అంది.

"పోస్టలార్డర్లకీ వాటికే అరవై రూపాయలు కావాలిట!"

"అలాగే చూద్దాం" అంటూ కదిలారు శర్మగారు.

తండ్రి వెళ్ళగానే తల్లిని అడిగాడు మూర్తి.

"నాన్నగారేమన్నారు? డబ్బిచ్చారా?"

"నెలాఖరు కదా! రెండు మూడు రోజుల్లో చూస్తానన్నారు! ఇంకా పది రోజుల వ్యవధి ఉంది కదా! పరీక్షకి కదుదువ్‌గాని" సర్ది చెప్పింది తల్లి

అంతలో ఎదురింటి వనజ రావడంతో వారి సంభాషణ ఆగిపోయింది. వనజ బేంక్ మేనేజరుగారి భార్య. రామశర్మగారి దూరపు బంధువు. కలుపుగోరుతనమూ మంచి మనసూ ఉన్న మనిషి. భర్త మంచి పొజిషన్‌లో ఉన్నా ఏ మాత్రమూ అహంభావంగానీ, గర్వంగానీ లేదు అప్పుడప్పుడు వస్తూంటుంది.

"రండి వదినగారూ! అన్నయ్యగారు బేంక్‌కి వెళ్ళారా? భోజనాలయ్యాయా?"

పలకరిస్తూ ఆహ్వానించింది శకుంతల.

"ఇప్పుడే వెళ్లారమ్మా! భోజనాలింకా కాలేదు. పిల్లలింకా స్కూలునుంచి రాలేదు! రామానికి బేంక్‌లో ఉద్యోగం వచ్చింది తెలుసా?" వార్త తెలియజేసింది వనజ.

'రామం' అంటే ఎవరో జ్ఞాపకం రాక తెల్లమొహం వేసింది శకుంతల.

"అతనేనమ్మా! మా పిల్లకి ట్యూషన్ చెబుతారే! సూర్యం మాష్టారు! వారబ్బాయి రామం!"

ఓహో! అతడా! చాల సంతోషం వదినగారూ! కుటుంబం గడవక నానా అగచాట్లూ పడ్తున్నారు!"

సంతోషం వ్యక్తం చేసింది శకుంతల.

రామానికి ఉద్యోగం అనగానే పక్కగదిలోకి పోతూన్న మూర్తి ఆసక్తిగా వెనక్కి తిరిగాడు. రామం తన క్లాస్‌మేట్. మంచి తెలివైనవాడు. తండ్రి రిటైర్ అయి పది సంవత్సరాలైంది. పెద్ద సంసారం! తల్లి ఒక సంపన్నుల ఇంట్లో వంట చేస్తోంది. రామం అదృష్టవంతుడు అనుకొన్నాడు మూర్తి. రామంతో బాటు తనని కూడా బేంక్ పరీక్షకు వెళ్లమని పోరింది వనజ. ఖాళీలు తక్కువుగా ఉన్నాయని అశ్రద్ధ చేశాడు మూర్తి. రామం కూడా మొదట్లో నిరాశపడ్డాడు. పైగా అతని దగ్గర డబ్బులేదు. వనజ ప్రోత్సాహంతో, ఆమె ఇచ్చిన డబ్బుతో పరీక్షకు వెళ్లాడు రామం. పట్టుదలగా చదివాడు. సెలక్టయ్యాడు. తాను చేసిన పొరబాటుకి పశ్చాత్తాపం చెందాడు మూర్తి.

"నిన్నుకూడా వెళ్లమన్నాను!వెళ్లావు కాదు!" అని వనజ అనడంతో మరీ బాధ పడ్డాడు మూర్తి.

"మాకు మంచి రోజులు రాలేదు వదినగారూ!" నిట్టూర్చింది శకుంతల. దానికి అంగీకరించలేదు వనజ.

"మంచి రోజులు రాలేదని మానవయత్నం మానేస్తావటమ్మా! మూర్తిని పరీక్షకు పంపనందుకు మీ అన్నయ్యగారెంతో బాధపడ్డారు. ఇప్పుడైనా

మించిపోయిందిలేదు. మొన్న పేపర్లో మళ్ళీ ఎడ్వర్టైజ్‌మెంట్ పడిందట! ఈ మారైనా కట్టించమని ఆయన మరీ మరీ చెప్పమన్నారు! మూర్తిని ఒకసారి రమ్మన్నారు! పరీక్షకు పోకుండా ఉద్యోగం ఎలా వస్తుంది. కష్టపడితే ఫలితం దక్కకపోదు!"

"మీ చేతి చలవ! పరీక్ష ఫీజు మీరే కట్టారు! రామం సెలక్టయ్యాడు!" అంది అలవోకగా శకుంతల.

ఆమె మాటలకి ఉబ్బి తబ్బిబ్బయ్యింది వనజ. స్వతహాగా పరోపకారి!

"దానికేముందమ్మా! మీకానమ్మకం ఉంటే మన మూర్తి బాబుకి కూడా నేనే ఇస్తా! మధ్యాహ్నం మా ఇంటికి రావోయ్!" అంది.

ఆమె ఔదార్యానికి సంతసించారు తల్లీకొడుకులిద్దరూ.

పరీక్ష ఫీజూ యితర ఖర్చులూ వనజ భరించింది. రేయింబవళ్ళు కష్టపడి చదివాడు మూర్తి. బేంకులో ఉద్యోగం సంపాదించాడు. విశాఖపట్నంలో పని చేస్తున్నాడు.

"మాష్టారూ!" పిల్చాడు శాస్త్రి.

పరాగ్గా ఉన్న మూర్తి పలకలేదు.

"ఆలోచిస్తున్నారా?" అడిగాడు అమాయకంగా. ఆ భావి భారత పౌరుని మొహంలోకి పరీక్షగా చూశాడు మూర్తి.

"ఇంటర్ అయ్యాక ఏం చదవాలనుకున్నావ్." అడిగాడు. అడిగిన ప్రశ్నే!

"ఇంజనీరింగ్ చదవాలనుకొంటున్నా. సీటు దొరుకుతుందంటారా?" అతని సందేహం నివృత్తి కాలేదు. అలాగే ఉండిపోయింది.

ఠకీమని సమాధానం చెప్పలేకపోయాడు మూర్తి. ఆలోచించాడు. నిరుత్సాహపరచలేదు. అలాగని గ్యారంటీగా చెప్పనూలేదు. ఇంజనీరింగు కాలేజీలో సీటుకి పోటీ ఎక్కువ. క్లాసులో పాసవుతాననంటున్నాడు. కాబట్టి తెలివైన వాడే అయి ఉంటాడు. ఎవర్నీ ఎప్పుడూ అధైర్యపర్చకూడదు. నిరాశా నిస్పృహలకు లోను

కానీయకూడదు.

"బాగా కష్టపడి చదివి ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్‌లో మంచి ర్యాంక్ సంపాదించుకో! సీటు తప్పకుండా దొరుకుతుంది!" అన్నాడు.

"మరి నేను ఫార్వర్డ్ కమ్యూనిటీకి చెందిన వాణ్ణి కదా!" సందేహాన్ని మరోసారి వెలిబుచ్చాడు. అతని మాటల్లో నిరాశా, నిస్పృహ ధ్వనించాయ్.

"ప్రతిభగల అభ్యర్థికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది!"

అతను తేలిగ్గా కొట్టి పారేసినట్లుగా అర్థం చేసుకొన్నాడు శాస్త్రి.

"వెనుకబడ్డ కులాల వాళ్లు, జాతుల వాళ్లూ మాకు పోటీకొస్తారు కదండి!" అన్నాడు అసూయగా.

ఆయా వర్గాలకీ, జాతులకీ వేరేగా సీట్లు కేటాయిస్తారోయ్! వాళ్ళు అర్హులు. వారిలో చదువుకొని పైకి వచ్చేవారు చాల తక్కువ. అలా వచ్చే వారికైనా చదువుకొనే అవకాశం కోసం వారికి ప్రత్యేకంగా సీట్లు కేటాయిస్తారు! అంత మాత్రాన ఈర్ష్యపడి ద్వేషభావాన్ని ఏర్పర్చుకోకూడదు! మనకోసం కేటాయించిన సీట్లలోనే మనం కష్టపడి ఓ సీటు సంపాదించుకోవాలి!"

నచ్చ చెప్పబోయాడు మూర్తి.

"అదేం బావులేదు మాష్టారూ! అందువల్ల మెరిట్ ఉన్న విద్యార్థులకి అన్యాయం జరుగుతొందనే నా అభిప్రాయం!" వాదించాడు శాస్త్రి.

అతని లేత మనసులో ఈర్ష్యా బీజం పడిందని గ్రహించాడు మూర్తి. దానిని మొలకెత్తనీయకూడదనుకొన్నాడు. అతని అంతరాంతారలలో గూడు కట్టుకొని ఉన్న దేషాన్ని చల్లార్చాలనుకొన్నాడు. నెమ్మదిగా చెప్పాడు.

"చూడు శాస్త్రీ! మనం పెరట్లో ఎన్నో మొక్కల్ని పాదుల్నీ పెంచుతాం! బీరా, దొండా, బెండా మొదలైనవాటితో బాటు ఒక కరివేపాకు మొక్కను కూడా పెంచుతాం! అన్ని మొక్కలూ పాదులూ బాగా ఎదగాలనీ మన అవసరాలు తీరాలనీ ఆశిస్తాం! అన్నీ ఎదిగి తొందరగా కాపుకొస్తాయ్! కానీ కరివేపాకు మొక్క మాత్రం

సరిగా ఎదగదు! దానికి బాలారిష్టాలు చాల ఎక్కువ. అందుకే మనం దానిని తక్కినవాటికన్నా ప్రత్యేక శ్రద్ధతో పెంచుతాం! అది ఎక్కడ చచ్చిపోతుందో అన్న బెంగతో, భయంతో దానికి ఎక్కువ చాకిరీ చేస్తాం! అలాగని మనం ఇతర పాదుల్నీ మొక్కల్నీ  నిర్లక్ష్యం చేసినట్టా, వాటికి అన్యాయం చేసినట్టు అవుతుందా? అవి అతి తక్కువ వ్యవధిలో ఎదిగి కాపుకొస్తాయ్. వాటికి ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం కానీ, శ్రమించాల్సిన పని గానీ లేదు.

అలాగే వెనుకబడిన వర్గాలకి జాతులకి వాటి ఉన్నతి కోసం మన ప్రభుత్వం

ప్రతేక సదుపాయాలు కల్పించడంలో తప్పేముందిచెప్పు? వారు మన సోదరులే అందుకు ఈర్ష్యచెందడంలోనూ, అసూయపడ్డంలోనూ అంలేదోయ్. సాటి సోదరులపై అనాలోచితంగా, అసూయపడి, ఆయాసపడి ఈర్ష్య ద్వేషాలను పెంచుకోవడం విప్లావభావలను అలవర్చుకోవడం అలజడులు రేపడం అనాగరికుల లక్షణం ఎమంటావ్?.

అని ఆగి ఆతృతగా అతని మొఖంలోనికి చూసాడు మూర్తి. మూర్తి మాటలు సబబుగా, సమంజసంగా తోచాయి శాస్త్రికి.

నిజమే మాష్టారు అన్నాడు తృప్తిగా.

అమితానంద చెందాడు మూర్తి.

అవునా నీకు మంచి రేంకు వస్తుంది. తప్పకుండా సీటు లభిస్తుంది. పట్టుదలగా చదువు. వేరే అలోచనలు పెట్టుకోకు. మే గాడ్ బ్లెస్ యూ అన్నాడు.

థాంక్యూసార్ అన్నాడు. వినయంగా విద్యార్థి.

ఒక్క విద్యార్థినైన ఒప్పించగలిగినందుకు సంతృప్తి చెందాడు మూర్తి.